సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



ఆట్యాపాట్యా పోటీలు ప్రారంభం

11వ సీనియర్స్ ఆట్యా-పాట్యా రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం భీమవరంలో ప్రారంభమయ్యాయి. పోటీల్లో 19 జిల్లాల నుంచి 30 జట్లు పాల్గొంటున్నాయి. 8లో



భీమవరంలో రెడ్‌క్రాస్ రక్తనిధి

భీమవరంలో రెడ్‌క్రాస్ కాంపోనెట్ బ్లడ్ బ్యాంక్ సేవలు ప్రారంభమయ్యాయి. రూ.2.5 కోట్ల విలువైన అత్యాధునిక వైద్యపరికరాలు, వసతులతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 8లో



షష్ఠి తిరునాళ్లకు సిద్ధం

అత్తిలిలో శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 6వ తేదీ నుంచి 20 వరకు ఉత్సవాలు జరుగుతాయి. 8లో

న్యూస్‌రీల్

బండి ముత్యాలమ్మను దర్శించుకున్న హైకోర్టు జడ్జి



హైకోర్టు జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ ఈవో తదితరులు

నరసాపురం రూరల్ : మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లిలో వేంచేసి ఉన్న బండి ముత్యాలమ్మను హైకోర్టు జడ్జి జస్టిస్ కె.సురేష్ రెడ్డి, హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ మోకా అరుణ్‌కుమార్, ఆలయ సిబ్బంది, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు. జడ్జిల వెంట నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ, బార్ వైస్ ప్రెసిడెంట్ కొత్తపల్లి రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యతో వివక్ష దూరం



సీతారామపురంలో దళిత ఆత్మీయ సమావేశంలో మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

నరసాపురం రూరల్: సమాజంలో విద్య ద్వారా ఆర్థిక స్థిరత్వం వస్తుందని, తద్వారా సామాజిక వివక్ష పోయి దళితులకు సమాజంలో గౌరవం దక్కుతుందని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. శనివారం నరసాపురం మండలంలోని సీతారామపురంలో జరిగిన దళిత ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. సమావేశంలో గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పేరుపాలెం బీచ్ మూసివేత

మొగల్తూరు: ఫెంగల్ తుపాన్ కారణంగా ఆదివారం పేరుపాలెం బీచ్‌కు పర్యాటకులను అనుమతించడం లేదని తహసీల్దార్ కె.రాజ్‌కిషోర్, ఎస్సై జి.వాసులు తెలిపారు. కార్తీక మాసం ఆఖరి ఆదివారం రోజు కావడంతో పర్యాటకులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నామని, పర్యాటకులు సహకరించాలని కోరారు.

మట్టి తోలకంపై అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్

కొయ్యలగూడెం : అక్రమ మట్టి తోలకాలపై పీడబ్ల్యూడీ అధికారులు దృష్టి సారించారు. శనివారం అక్రమ మట్టి తోలకాలు చేసిన ప్రదేశాల్లో పర్యటించారు. నవంబర్ 29న సాక్షి పత్రికలో ప్రచురితమైన ‘యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు’ శీర్షికకు స్పందించిన ఏఈ మంగమూరి రాహుల్ భాస్కర్ దిప్పకాయలపాడు పరిసర గ్రామాలలోని సాగునీటి చెరువులను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజు చెరువు ట్యాంక్ నుంచి మట్టి అక్రమ తరలింపు జరిగినట్లు నిర్ధారించి ఉన్నతాధికారులకు పూర్తి నివేదికను అందజేస్తామన్నారు. మట్టి అక్రమంగా రవాణా చేసిన వ్యక్తుల గురించి దర్యాప్తు చేస్తున్నామని భాస్కర్ తెలిపారు. మంగపతిదేవిపేట సమీపంలోని చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టును రాత్రి వేళల్లో అక్రమార్కులు టిప్పర్లు ఏర్పాటు చేసి తరలించుకుపోతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

శ్రీవారి క్షేత్రంపై తుఫాన్ ప్రభావం



శ్రీవారి ఆలయ ప్రాంతంలో భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీపై శనివారం ఫెంగల్ తుపాను ఎఫెక్ట్ పడింది. ప్రతి శనివారం వేలాది మంది స్వామిని దర్శించుకుంటారు. తుపాను కారణంగా రైతులు, రైతు కూలీలు పంటలను ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నం కావడంతో భక్తుల రద్దీ తగ్గింది. తూర్పు రాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్, ప్రసాదం, టికెట్ కౌంటర్లు ఇతర విభాగాల్లో భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది.

చేనేతపై చిన్నచూపు



నేతన్నలకు అందని సర్కారు సాయం

అత్తిలి మండలం శివపురం చేనేతకు పెట్టింది పేరు. గ్రామంలో 250 వరకు కుటుంబాలు ఉంటే దాదాపు అంతా నేత సామాజిక వర్గానికి చెందిన వారే. దివంగత వైఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన చేనేత రంగాన్ని తర్వాత పట్టించుకున్న వారు లేక సంక్షోభంలో కూరుకుపోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన నేతన్న నేస్తం, సంక్షేమ పథకాలు ఈ రంగానికి ఊపిరిలూదాయి. గ్రామంలో 140 వరకు కుటుంబాలు మగ్గం నేస్తుంటే అర్హత కలిగిన సుమారు 120 కుటుంబాలకు నేతన్న నేస్తం లబ్ధి చేకూరేది. అదనంగా అమ్మ ఒడి, చేయూత, పింఛన్ తదితర రెండు మూడు పథకాల సాయం అందేది. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమం జాడలేకపోవడంతో నేత కార్మికులు మగ్గానికి స్వస్తి చెబుతున్నారు. గత కొద్ది నెలల్లో సగం మేర మగ్గాలు మూతపడగా ప్రత్యామ్నాయ ఉపాధి పనుల్లోకి వెళ్లిపోతున్నారు.

- మూతపడుతున్న మగ్గాలు
- నేత కార్మికులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24 వేల చొప్పున సాయం
- గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో రూ. 12.76 కోట్ల సాయం



శివపురంలోని చేనేత కార్మికుడి ఇంట్లో మూతపడిన మగ్గం

సాక్షి, భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 6 వేల వరకు చేనేత కుటుంబాలు ఉన్నట్టు అంచనా. పాలకొల్లు, అత్తిలి, యలమంచిలి, పెంటపాడు, పోడూరు, ఆచంట మండలాల్లో నేత కార్మికులు అధికంగా ఉన్నారు. పాలకులు చేనేతను చిన్నచూపు చూడడంతో చాలామంది జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళ్లిపోగా నమ్ముకున్న కులవృత్తిని వదిలిపెట్టలేక కొందరు ఇదే రంగంలో కొనసాగుతున్నారు.

నేతన్నకు అండగా



చేనేత రంగానికి గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. సొంత మగ్గం ఉన్న నేత కార్మికుల కుటుంబాలకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద నెలకు రూ. 2000 చొప్పున ఏడాదికి రూ.24,000 ఆర్థిక సాయం అందించారు. ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో సరాసరి 1,063 కుటుంబాలకు రూ.12.76 కోట్ల లబ్ధి చేకూరింది. ప్రస్తుత పశ్చిమగోదావరి జిల్లాలో 920 కుటుంబాలకు రూ.10.96 కోట్లు, ఏలూరు జిల్లాలో 150 కుటుంబాలకు రూ.1.8 కోట్లు సాయం అందించారు. నేతన్న నేస్తంతో పాటు ఆయా కుటుంబాల్లోని అర్హత కలిగిన తల్లులకు అమ్మ ఒడి, చేయూత, పింఛన్, వాహనమిత్ర, ఆరోగ్య శ్రీ వైద్యం తదితర పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి లక్షలాది రూపాయల ప్రభుత్వ సాయం అందింది. గతంలో దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో చేనేత సంఘాల రుణాలు మాఫీ చేయడంతో పాటు పావలా వడ్డీకే రుణ సదుపాయం, కార్మికులకు 50 సంవత్సరాలకే పింఛన్ తదితర ఎన్నో కార్యక్రమాలు అమలుచేస్తే తండ్రి బాటలోనే సీఎం జగన్ నేతన్నలను ఆదుకుంటూ వచ్చారు.

గత ప్రభుత్వంలో నేతన్న నేస్తం సాయం

పశ్చిమగోదావరి జిల్లా

సంవత్సరం	లబ్ధిదారులు	ప్రభుత్వ సాయం (రూ.కోట్లలో)
2019-20	854	2.01
2020-21	1,067	2.57
2021-22	779	1.87
2022-23	839	2.02
2023-24	1,027	2.47

ఏలూరు జిల్లా

సంవత్సరం	లబ్ధిదారులు	ప్రభుత్వ సాయం (రూ.లక్షల్లో)
2019-20	142	34.1
2020-21	187	44.9
2021-22	120	28.8
2022-23	149	35.76
2023-24	153	36.72

మూతపడుతున్న మగ్గాలు

చేనేత కార్మికులను అన్ని విధాల ఆదుకుంటామని, ఎన్టీఆర్ హయాంలో మాదిరి చీర-ధోవతి పథకాన్ని పునరుద్ధరిస్తానని, చేనేత ఉత్పత్తులపై 30 శాతం రిబేటు ఇస్తామంటూ 2014 ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తలేదు. ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకోవాలని నేతన్నలను చిన్నచూపు చూశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక అదే ధోరణిలో ఉన్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చేనేత రంగాన్ని ప్రోత్సహిస్తూ నేత కార్మికులకు మేలు చేకూర్చే దిశగా కార్యక్రమాలు అమలుచేయడం లేదని నేత కార్మికులు వాపోతున్నారు. ఇతర సంక్షేమ పథకాల లబ్ధి లేకపోవడంతో చేనేత కుటుంబాలకు పూటగడవడం కష్టంగా మారింది. చాలామంది నేత పని వీడి వ్యవసాయ కూలీలుగా, ఇతర పనుల్లోకి వెళ్లిపోతున్నారు.



చేనేతకు ఆదరణ లేదు



“గతంలో నేతన్న నేస్తంతో పాటు ఏవో రెండు మూడు పథకాల ద్వారా చేనేత కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందేది. దీంతో కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు అవేమీ లేకపోవడంతో చాలామంది చేనేతను వీడి ఇతర పనుల్లోకి వెళ్లిపోతున్నారు.

– ఎస్.బాలవీరయ్య, చేనేత కార్మికుడు, శివపురం

మగ్గం మూలన పడిపోయింది



చేనేత పనికి కష్టకాలం దాపురించింది. మగ్గం బాగుచేయించుకునేందుకు డబ్బులు లేక మూలన పడేశాను. చిన్నతనం నుంచి నేత పని తప్ప వేరే తెలీదు. ఆదరణలేక పూట గడవడం కష్టంగా ఉంది. ప్రభుత్వం సాయం అందించి చేనేత కార్మికులను ఆదుకోవాలి.

– పి.కాశీ, చేనేత కార్మికుడు, అత్తిలి

సంక్షేమ పథకాల ఊసు ఎత్తడం లేదు



ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆరు నెలలు గడిచినా సంక్షేమ పథకాల ఊసు ఎత్తడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేతన్న నేస్తంలో ఏడాదికి రూ.24,000 బ్యాంకు ఖాతాలో జమయ్యేవి. డ్వాక్రా రుణమాఫీ, వైఎస్సార్ చేయూత పథకాలు ద్వారా ఆర్థిక ప్రయోజనం కలిగింది.

– చల్లా సాంబయ్య, చేనేత కార్మికుడు, పాలకొల్లు మండలం

లైంగిక చట్టాలపై అవగాహన కల్పించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: బాలలు, మహిళలకు లైంగిక చట్టాలపై అవగాహన కలిగించడంతోపాటు పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శనివారం భీమవరం కాస్మోపాలిటిన్ క్లబ్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలలు, మహిళలపై అత్యాచార నిరోధక చట్టాలపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో లైంగిక దాడులను సమర్థంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలు అనే నినాదం కొనసాగుతున్న సమయంలో పురుషుల కంటే స్త్రీలు మరింత ఎక్కువగా పనిచేయాలన్నారు. మహిళలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పోటీపడే అవకాశం కల్పించడంలో కృషి చేయాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి మహేశ్వరరావు మాట్లాడుతూ ఆడ, మగ తేడా లేని సమాజ నిర్మాణం జరగాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ, కార్మిక శాఖాధికారిణి ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సహకరించాలి



మిల్లర్లతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: వాతావరణం అనుకూలంగా లేని కారణంగా కృష్ణా జిల్లా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి మానవత దృక్పథంతో ఆదుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లుల యజమానులను జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ యజమానులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ప్రతి రైసు మిల్లు నుంచి రెండు సొంత వాహనాలు కృష్ణా జిల్లాకు పంపించాలని మిల్లర్స్ యజమానులకు సూచించారు. భారీ వర్షాల కారణంగా వరి కోతలు కొన్ని రోజులు వాయిదా వేయాలన్నారు. ఇప్పటికే కోతలు కోసి, కల్లాల్లో ఉన్న ధాన్యంను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులను కొరత లేకుండా అందించాలని కోరారు.

బాబు పాలనలో బాదుడు గ్యారంటీ

పుప్పాల వాసుబాబు, మాజీ ఎమ్మెల్యే



గణపవరం: బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ నినాదం.. బాబు ష్యూరిటీ వీర బాదుడు గ్యారంటీగా మారిపోయిందని, ప్రజలకు నెమ్మదిగా అసలు నిజం తెలుస్తుందని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం రాత్రి ఆయన వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే ప్రజలకు వాస్తవం బోధపడుతుందన్నారు. అన్నిరకాల నిత్యావసరాలు, పప్పులు, నూనెలు, కూరగాయల ధరలు పెరిగిపోయి, సామాన్య, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితి దాపురించిందన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.15 వేల కోట్ల వీరబాదుడు పూర్తి చేశారన్నారు. ప్రజలను ఏమార్చడంలో ఆరితేరిన బాబు ఎన్నికలలో ప్రజలను సూపర్‌సిక్స్ హామీలతో మభ్యపెట్టారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ కాస్తా సూపర్ మోసంగా మారిపోయిందన్నారు. తక్కువ ధరకే మద్యం, ఉచితంగా ఇసుక హామీలు గాలికి కొట్టుకుపోయాయని అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలలో అప్పుడే వ్యతిరేకత వస్తుందని, ఇలా గతంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు.

ఫెంగల్ అలజడి

- ఆందోళనలో తీర ప్రాంత వాసులు
- పీఎం లంకలో ఎగసిపడుతున్న సముద్రం
- నరసాపురం తీరంలో నిలిచిన వేట



నరసాపురం మండలం పీఎం లంకలో ఎగసిపడుతున్న సముద్రపు అలలు

నరసాపురం: జిల్లాలోని తీరప్రాంతంలో ఫెంగల్ తుఫాన్ అలజడి సృష్టిస్తోంది. శనివారం మధ్యాహ్నం నుంచి గాలులు, వర్షంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఒక పక్క ధాన్యం మాసూళ్లు కొనసాగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు తుఫాన్ ప్రభావంతో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అధికారులు తుఫాన్ రక్షణ చర్యలు ప్రారంభించారు. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంతో పాటుగా, నరసాపురం, మొగల్తూరు తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూంలు ఏర్పాటు చేశారు. సోమవారం వరకూ బలమైన గాలులు, అధిక వర్షాలు ఉంటాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తి అదుపులో ఉందని అవసరమైతే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు పరిస్థితులను బట్టి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకుంటామని నరసాపురం ఆర్డీవో దాసి రాజు చెప్పారు.

పీఎం లంకలో ఉధృతంగా సముద్రం

తుఫాన్ ప్రభావం శనివారం ఉదయం నుంచి నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని తీరప్రాంత గ్రామాలపై కనిపించింది. సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. నరసాపురం మండలం పెదమైనవానిలంక గ్రామంలో అలలు ఎగసిపడుతున్నాయి.

నిలిచిన వేట

తుఫాన్ కారణంగా వేటపై అధికారులు నిషేధం విధించారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న బోట్లు కొన్ని తీరానికి చేరుకుంటున్నాయి. తుఫాన్ ప్రభావం కార్తీక వనసమారాధనపై పడింది. సీతారామపురంలో ఆదివారం నిర్వహించ తలపెట్టిన కాపు కార్తీక వన సమారాధన, పట్టణంలోని మాలెం వీధిలో నిర్వహించ తలపెట్టిన అగ్నికుల క్షత్రియ కార్తీక వన సమారాధనను తుఫాన్ కారణంగా వాయిదా వేశారు.

రియల్.. ఢమాల్

- ఉమ్మడి జిల్లాలో స్తంభించిన రియల్ ఎస్టేట్ లావాదేవీలు
- సుమారు 650 ఎకరాల్లో ప్రైవేటు వెంచర్లు
- నెలకు పదుల సంఖ్యలో కూడా లేని అమ్మకాలు
- మార్కెట్‌లో నగదు లావాదేవీలు తగ్గడమే ప్రధాన కారణం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రియల్ ఎస్టేట్ ఊపందుకుంటుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న వారికి కూటమి ప్రభుత్వంలో నిరాశే ఎదురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రియల్ ఎస్టేట్ పెరుగుతుందని అనుకుంటే పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. ఎన్నికలు తరువాత నుంచి మార్కెట్‌లో నగదు లావాదేవీలు పూర్తిగా తగ్గిపోవడం, ఏటా ఐదు శాతం కూడా భూమి ధరలు పెరుగుతున్న పరిస్థితులు లేకపోవడం, నిర్మాణాలకు ఇసుక కొరత వెంటాడుతుండటం ఇలా అన్ని సమస్యలు కలిసి జిల్లాలో రియల్ ఎస్టేట్ కుదేలైంది. దీంతో నిత్యం రిజిస్ట్రేషన్లతో కళకళలాడే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి.

ఆసక్తి చూపని కొనుగోలుదారులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గతేడాది ఉన్న మార్కెట్ ధరలే నేటికీ కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల తక్కువగా ఉండటంతో కొనుగోలుదారులు, అమ్మకందారులు విక్రయాలకు ఆసక్తి చూపడం లేదు. పశ్చిమగోదావరి జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పరిధిలో సుమారు 410 ఎకరాల్లో రియల్ వెంచర్లు ఉన్నాయి. ప్రధానంగా భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెంలో పదుల సంఖ్యలో వెంచర్లు ఉన్నాయి. ఒక్క తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాంలోనే 25కు పైగా వెంచర్లున్నాయి. ఏలూరు జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 240 ఎకరాలకుపైగా రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నాయి. ఏలూరు, జంగారెడ్డిగూడెం, కైకలూరు, నూజివీడు, చింతలపూడిలో రియల్ వెంచర్లు అధికంగా ఉన్నాయి. వందల ఎకరాల్లో ఉన్న వెంచర్లలో నెలకు 20 ప్లాట్లు కూడా అమ్ముడవని పరిస్థితి. నిర్మాణరంగం కూడా ఇంచుమించు ఇదే పరిస్థితుల్లో ఉంది. జాతీయ రహదారి వెంట, కార్పొరేషన్ పరిధి, గేటెడ్ కమ్యూనిటీ, లక్కీడిప్‌లు, లాటరీలు ఇలా ఎన్నిరకాల స్కీంలతో రియల్ కంపెనీలు విస్తృత ప్రచారం చేసినా కొనుగోలుదారుల్లో ఆసక్తి కనిపించడం లేదు.



ఏలూరులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం


నగదు రొటేషన్ లేక ఢీలా

వెంచర్లతో పాటు పొలాలు, పట్టణాల్లోని ఖాళీ స్థలాల విక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని శనివారపుపేట మెయిన్ రోడ్డు వెంట గతేడాది మొదట్లో రూ.25 వేలు పలికిన చదరపు గజం ఈ రోజుకూ అదే ధర ఉంది. అమ్మకందారుడికి అత్యవసరమైతే మరింత తక్కువకు కూడా విక్రయాలు జరుగుతున్న పరిస్థితులున్నాయి. నిర్మాణం పూర్తై విక్రయాలకు నోచుకోక వందల ఇళ్లు బిల్డర్ల వద్దనే ఉన్నాయి. వాస్తవానికి ఏడాదిన్నర క్రితం వరకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, కైకలూరు, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరంలో రియల్ ఎస్టేట్ లావాదేవీలు స్పీడ్‌గా ఉండటంతో పాటు ఏటా సగటున 10 నుంచి 20 శాతం రియల్ పెరుగుదల ఉంది. ముఖ్యంగా జిల్లాలోని జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెంలో గత ఐదేళ్లల్లో భూముల ధరలు దాదాపు రెట్టింపయిన పరిస్థితి. జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీ పరిధిలో వేగంగా అభివృద్ధి జరగడం, పోలవరం పరిహారం పొందిన వారిలో ఎక్కువ మంది జంగారెడ్డిగూడెం చుట్టుపక్కలే భూములు కొనుగోలు చేస్తుండటంతో గత ఏడేళ్లగా రెండు రెట్ల భూమి విలువ పెరిగింది. కూటమి ప్రభుత్వం రాగానే అమరావతి ప్రచారంతో పెట్టుబడులు అమరావతి వైపే మళ్లిస్తుండటంతో ఆరు నెలల వ్యవధిలో కొత్త వెంచర్లు ప్రారంభం కాలేదు.

తగ్గిపోతున్న రిజిస్ట్రేషన్లు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గతేడాదితో పోల్చితే ఏలూరు జిల్లాలో 11,180, పశ్చిమగోదావరి జిల్లాలో 12,290 రిజిస్ట్రేషన్లు తగ్గాయి. 2023 జనవరి 1 నుంచి నవంబర్ 29 వరకు ఏలూరు జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విక్రయాలు గిఫ్ట్ డీడ్, తనఖా రిజిస్ట్రేషన్లు, ఇతర రిజిస్ట్రేషన్లు కలిపి 68,270 జరగగా, ఈ ఏడాదిలో నవంబర్ 29 వరకు 54,690 మాత్రమే జరిగాయి. దీనిలో కూడా అత్యధికంగా ఏలూరు, నూజివీడు, భీమడోలు, చింతలపూడిలోనే జరిగాయి. పశ్చిమగోదావరి జిల్లాలో గతేడాది అన్ని రకాల రిజిస్ట్రేషన్లు కలుపుకుని 15 కార్యాలయాల పరిధిలో 96,377 జరగగా ఈ ఏడాది ఇంతవరకు 84,087 జరిగాయి. పశ్చిమలో అత్యధికంగా తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నర్సాపురం, తణుకులో ఉన్నాయి.

నేడు న్యాయవాది శ్రీనివాస్ చిత్రపటం ఆవిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ

నరసాపురం : నరసాపురం బార్‌లో సుదీర్ఘ కాలం పనిచేసిన దివంగత న్యాయవాది కొమాండూరి శ్రీనివాస్ చిత్రపటం ఆవిష్కరణకు పలువురు న్యాయమూర్తులు హాజరవుతున్నారు. ఆదివారం నరసాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తెలగా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. చిత్రపటం ఆవిష్కరణకు హైకోర్టు న్యాయమూర్తి కె.సురేష్‌రెడ్డి, రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఆకుల శేషసాయి, జిల్లా న్యాయమూర్తి పురుషోత్తం కుమార్, ఏపీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చిదంబరం హాజరవుతారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ చెప్పారు.

క్లుప్తంగా

ఆట్యాపాట్యా రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

భీమవరం: భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎమ్ హైస్కూల్లో 11వ సీనియర్స్ ఆట్యా –పాట్యా రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. టూటౌన్ సీఐ జి కాళీచరణ్, డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణ రాజు(బాబు) ఈ పోటీలను ప్రారంభించారు. రెండురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి 30 జట్లకు పైగా పురుషులు, మహిళా క్రీడాకారులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. కళాశాల సంయుక్త కార్యదర్శి కూనపరాజు రామకృష్ణంరాజు, ఆట్యా పాట్యా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మంతెన రామచంద్రరాజు, రాష్ట్ర అసోసియేషన్ సీఈవో ఆర్‌డీ ప్రసాద్, టోర్నమెంట్ నిర్వాహకుడు జీపీసీ శేఖర్‌రాజు, రాంభద్రరాజు, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేగంగా అపార్ నమోదు



సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటున్న విద్యార్థులు

యలమంచిలి: విద్యార్థుల అపార్ నమోదు కార్యక్రమం జిల్లాలో వేగంగా జరుగుతుంది. సాధారణ పౌరుల గుర్తింపునకు ఉన్న ఆధార్ కార్డు తరహాలోనే విద్యార్థులకు శాశ్వత గుర్తింపు సంఖ్యతో కూడిన ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ఐడీ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ అన్ని యాజమాన్య పాఠశాలల్లో అపార్ పేరుతో ప్రతి విద్యార్థికి ప్రత్యేక నంబర్ నమోదు చేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల యాజమాన్యంలో మొత్తం 2,047 పాఠశాలలు ఉండగా వాటిలో 2,77,254 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో శనివారం నాటికి 2,23,732 మంది విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో అపార్ నమోదు 80.70 శాతం పూర్తయినట్లు డీఈవో ఈవీవీఎస్‌ఎస్‌బీఎల్ నారాయణ తెలిపారు.

చోరీపై కేసు నమోదు

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలో ఓ ఇంట్లో జరిగిన చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం గ్రామంలో నివసిస్తున్న డీఎస్‌వీఆర్ సూర్యనారాయణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఈనెల 26న ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. 29వ తేదీన తిరిగి రాగా ఇంటి తాళాలు తీసి ఉండడంతో, ఇంట్లో రూ.13 వేల నగదు, రూ.50 వేల విలువైన వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● ఎయిడ్స్‌ను తరిమేద్దాం



ఎయిడ్స్ లోగోతో సెయింట్ థెరిస్సా కళాశాల విద్యార్థినుల ర్యాలీ

ఎయిడ్స్‌ను అవగాహనతో తరిమేద్దాం అంటూ శనివారం సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఎయిడ్స్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్టు మేనేజర్ కీర్తి శిరీష హెచ్‌ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎయిడ్స్ వ్యాధి తొలి కేసు నమోదై మూడు దశాబ్దాలు దాటినా ప్రజల్లో ఈ వ్యాధి మీద అనేక అపోహలు, సందేహాలు ఇంకా కొనసాగుతున్నాయని, ఈ వైరస్‌ను అదుపు చేస్తూ దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు.

– ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)

● శివకేశవులు ఒక్కటే



వేంకటేశ్వరస్వామి అలంకరణలో శివయ్య

శివకేశవులకు భేదం లేదు.. వారిద్దరూ ఒక్కటే అని చాటిచెబుతూ కన్నాపురంలోని శ్రీ దుర్గా భవాని రసలింగేశ్వర స్వామివారిని శనివారం శ్రీవేంకటేశ్వరునిగా విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం నుంచి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తరించారు.

– కొయ్యలగూడెం

● ఉమాసోమేశ్వరునికి పుష్పాలంకరణ



ప్రత్యేక అలంకరణలో ఉమాసోమేశ్వరస్వామి

కార్తీక మాసం చతుర్దశి పర్వదినాన భీమవరం పంచారామక్షేత్రంలోని శ్రీఉమా సోమేశ్వర జనార్దనస్వామివారికి శనివారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూలమాలలతో శివయ్యని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన ఆ భుజంగ భూషణుడ్ని భక్తులు దర్శించి పరవశించారు. మహిళలు ఆలయంలో భక్తిప్రపత్తులతో కార్తీక దీపాలు వెలిగించారు.

– భీమవరం (ప్రకాశం చౌక్)

భీమవరంలో రెడ్‌క్రాస్ రక్తనిధి

- జిల్లాల పునర్విభజనతో భీమవరం కేంద్రంగా సాకారమైన కల
- రూ. 2.5 కోట్ల వ్యయంతో కాంపోనెంట్ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు
- అందుబాటులో హోల్ బ్లడ్, ఎర్ర రక్తకణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్
- ప్రభుత్వం నిర్ణయించిన ప్రాసెసింగ్ చార్జీలకే బ్లడ్, కాంపోనెంట్లు

సాక్షి, భీమవరం: జిల్లా కేంద్రం భీమవరంలో రెడ్‌క్రాస్ కాంపోనెట్ బ్లడ్ బ్యాంక్ సేవలు ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూ. 2.5 కోట్ల విలువైన అత్యాధునిక వైద్యపరికరాలు, వసతులతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దాతల అవసరం లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రాసెసింగ్ చార్జీలతోనే ఇక్కడ ఆపదలో ఉన్న వారికి అవసరమైన హోల్ బ్లడ్, ఎర్ర రక్తకణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్‌లను అందిస్తారు.

గత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు కేంద్రంగా రెడ్‌క్రాస్ సేవలందించేది. 2022లో జిల్లాల పునర్విభజన అనంతరం నూతన పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి భీమవరం కేంద్రంగా కొత్త కమిటీ ఏర్పాటైంది. అప్పటికే తణుకు, నరసాపురంలో రెండు రెడ్‌క్రాస్, జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలకు చెందిన మరో ఏడు వరకు బ్లడ్ బ్యాంక్‌లు ఉన్నాయి. డబ్ల్యూహెచ్‌ఓ లెక్కల ప్రకారం మొత్తం జనాభాలో 1.25 శాతం రక్త యూనిట్లు (ఒక్కో యూనిట్ 450 ఎంఎల్) అందుబాటులో ఉండాలి. నూతన పశ్చిమగోదావరి జిల్లా జనాభా దాదాపు 20 లక్షలు కాగా 25 వేల యూనిట్ల రక్తం, రక్త భాగాలు అవసరమవుతాయి. తొమ్మిది వరకు బ్లడ్ బ్యాంకులు ఉన్నా ఇంకా తీవ్ర కొరత ఉన్నట్టు రెడ్‌క్రాస్ జిల్లాశాఖ గుర్తించింది. సమస్యను అధిగమించేందుకు భీమవరంలో అత్యాధునిక కాంపోనెంట్ బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ ప్రతిపాదనను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆమోదించడంతో పాటు ఇంటర్నేషనల్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రూ. 1.5 కోట్లు విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను అందజేసింది.



భీమవరంలోని రెడ్‌క్రాస్ కాంపోనెంట్ బ్లడ్ బ్యాంకు భవనం



ఆధునిక బ్లడ్ కలెక్షన్ మానిటర్లు



రక్తం ప్రోసెసింగ్ కోసం వినియోగించే ఆధునిక సాంకేతిక పరికరాలు



రక్తం, కాంపోనెంట్లను భద్రపరిచే ఫ్రీజర్లు

రాయలంలో ప్రారంభం

ఈ విషయాన్ని జిల్లా రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు నాటి కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ పి ప్రశాంతి దృష్టికి తీసుకువెళ్లగా రాయలం పంచాయతీ కార్యాలయం పక్కనే గల ప్రభుత్వ భవనాన్ని బ్లడ్ బ్యాంక్ కోసం కేటాయింపు చేయించారు. ఉద్యోగులు, ప్రజల నుంచి జిల్లాశాఖ కోటి రూపాయల మేర విరాళాలు సేకరించి భవనంలో వైద్య పరికరాల ఏర్పాటుకు అవసరమైన మార్పులు చేర్పులు, వసతులు కల్పించింది. ప్రస్తుత కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ సీహెచ్ నాగరాణి ప్రత్యేక చొరవతో పనులు త్వరితగతిన పూర్తిచేయించి గత నెల 18వ తేదీన బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించారు.

అధునాతన వసతులతో..

ప్రస్తుతం తణుకు, నరసాపురంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులు హోల్ బ్లడ్‌ను మాత్రమే అందిస్తాయి. కాగా భీమవరంలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తాన్ని ప్రాసెసింగ్ చేసి హోల్ బ్లడ్‌తో పాటు ఎర్ర రక్తకణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ అందించే విధంగా ఆధునిక వసతులు కల్పించారు. రోగి భద్రత, సమగ్రమైన పరీక్షల నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ రక్తం, రక్త భాగాలను సురక్షితంగా భద్రపరిచేందుకు క్రయోఫ్యూజ్, బ్లడ్ కలెక్షన్ మానిటర్లు, మైనస్ 40 డిగ్రీలు, మైనస్ 80 డిగ్రీల ఫ్రీజర్లు, బ్లడ్ ఎనలైజర్లు తదితర అత్యాధునిక సాంకేతిక రక్త పరీక్షల పరికరాలను ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరాల ఏర్పాటు, దాతల కోసం బ్లడ్ బ్యాంకు వద్ద ప్రత్యేక వసతులు కల్పించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలోని మిగిలిన రెండు బ్లడ్ బ్యాంకుల ప్రాసెసింగ్ యూనిట్ల సామర్థ్యం ఏడాదికి నాలుగు వేలు కాగా భీమవరంలోని బ్లడ్ బ్యాంక్ సామర్థ్యం ఎనిమిది వేల యూనిట్లు కావడం గమనార్హం.

నాన్ గవర్నమెంట్ బ్లడ్ బ్యాంకుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ప్రాసెసింగ్ చార్జీలు

బ్లడ్/ కాంపోనెంట్స్	ప్రాసెసింగ్ చార్జీలు
హోల్ బ్లడ్	రూ.1,550
ఎర్ర రక్తకణాలు	రూ.1,550
ప్లాస్మా	రూ.400
ప్లేట్‌లెట్స్ కాన్సన్‌ట్రేట్	రూ.400
క్రైయో పెర్సిపిటేట్	రూ.250

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా



రక్త సేకరణ, పరీక్ష, ప్రాసెసింగ్, స్టోరేజీలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేశాం. ఫండ్ రైజింగ్, మెంబర్‌షిప్ ద్వారా బ్లడ్ బ్యాంకు నిర్వహణకు కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఎనలేని సహకారం అందిస్తున్నారు. రక్తం కొరతను తీర్చడం, అత్యవసర పరిస్థితులు, శస్త్రచికిత్సల సమయంలో ప్రాణాలను రక్షించే సహాయాన్ని అందించడం లక్ష్యంగా ఈ కేంద్రం పనిచేస్తుంది.

– డా.భద్రిరాజు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, భీమవరం

దాతల అవసరం లేకుండానే..

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బ్లడ్ బ్యాంకులు రక్తాన్ని అమ్మకూడదు. దాత నుంచి సేకరించాక మరొకరి శరీరంలోకి ఎక్కించేందుకు సురక్షితమో కాదో నిర్ధారించే పరీక్షలు, భద్రపరిచేందుకు అవసరమైన ప్రాసెసింగ్ చార్జీలు మాత్రమే తీసుకోవాలి. కాగా చాలా వరకు ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల్లో ఇష్టానుసారంగా ధరలు వసూలు చేస్తుంటారు. వీటితో పాటు ఒకరిద్దరు రక్తదాతలను తీసుకువెళ్లాలి. అరుదుగా ఉండే ఓ నెగెటివ్, బి నెగెటివ్, ఏబీ నెగెటివ్ గ్రూపుల బ్లడ్ కోసం అయితే ఈ ధరలు మరింత ఎక్కువగా ఉంటాయి. కాగా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో దాతల అవసరం లేకుండానే ప్రభుత్వం నిర్ణయించిన ప్రాసెసింగ్ చార్జీలతో రక్తం, కాంపోనెంట్లను అందజేస్తారు. రోగి తాలుకూ బ్లడ్ శాంపిల్, వైద్యుని సిఫార్సు లేఖ తీసుకువెళితే సరిపోతుంది.

లారీని ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ మృతి

కాళ్ల: ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొనడంతో ఓ మోటార్‌సైక్లిస్టు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం కాళ్ల మండలం సీసలిలో చోటుచేసుకుంది. కాళ్ళ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జువ్వలపాలెం గ్రామానికి చెందిన ముంజేటి పైడిరాజు (25), చోడవరపు మధుబాబు శనివారం ఉదయం మోటార్‌సైకిల్‌పై ఎల్‌ఎన్‌పురం గ్రామానికి చేపల ప్యాకింగ్ పని నిమిత్తం వెళ్తున్నారు. సీసలి గ్రామానికి వచ్చేసరికి రైస్‌మిల్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుకనుంచి వీరి మోటార్‌సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న పైడిరాజు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న మధుబాబుకు గాయాలుకాగా భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పైడిరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి అన్నయ్య నారాయణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కాళ్ళ ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.


తండ్రికి తలకొరివి పెట్టిన తనయ



తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో తన తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహించింది ఓ తనయ. పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పాతంశెట్టి సూర్యనారాయణ (50) శుక్రవారం కడుపునొప్పితో బాధపడుతుండగా పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం భీమవరం తీసుకువెళుతుండగా మార్గమధ్యలో గుండెపోటుతో మృతి చెందారు. సూర్యనారాయణకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శనివారం సూర్యనారాయణ భౌతికకాయానికి తానే కొడుకై అంతిమ సంస్కారాలు నిర్వహించింది పెద్దకుమార్తె రితిక.

అత్తిలి షష్ఠి తిరునాళ్లకు సర్వం సిద్ధం



శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారు



ఆలయం వద్ద దేవతామూర్తుల సెట్టింగ్

ఈనెల 6న రాత్రి శ్రీస్వామివారి కల్యాణం

అత్తిలి: శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 6వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే షష్ఠి మహోత్సవాల్లో ప్రతిరోజు సాయంత్రం స్వామివారి కళావేదికపై పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో భారీ చలువ పందిళ్లను నిర్మించారు. ఆలయ ముఖద్వారం నుంచి ఆలయం వరకు గల ప్రధాన మార్గాల్లో విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో రంగుల రాట్నాలు, జెయింట్ వీల్స్, ఎగ్జిబిషన్‌లు నెలకొల్పారు. ఈనెల 6వ తేదీ రాత్రి 8.28 గంటలకు కూనపరెడ్డి తేజ, విజయలక్ష్మి దంపతులచే శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. 7న షష్ఠి తీర్థ మహోత్సవం సందర్భంగా ఉదయం కోలాట భజన, అన్నసమారాధన, రాత్రి శ్రీస్వామివారి ఊరేగింపు ఉత్సవం జరుగుతాయని షష్ఠి కమిటీ సభ్యులు తెలిపారు. 8వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వివిధ ప్రదర్శనలు జరుగుతాయన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి





విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పెదవేగి : విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. పెదవేగి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ఈనెల 28వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి ఎన్‌సీసీ విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదుపరి జోన్ 1, 2, 3, 4 చెందిన గురుకుల పాఠశాల క్రీడాకారుల ఫ్లాగ్ మార్చ్‌ను కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొంది ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్న క్రీడాకారులకు కలెక్టర్ మొమెంటోలను అందజేశారు. తొలుత విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సంస్థ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎస్.సంజీవరావు , ఏ.మురళీకృష్ణ ఏఎంఓ బీవీ మల్లేశ్వరరావు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐ ఏలూరు, తూర్పు, కృష్ణా జిల్లాల సమన్వయ అధికారులు ఎస్.భారతి, ప్రిన్సిపాల్ వెంకటరావు, కె.ప్రేమావతి, తహసీల్దార్ భ్రమరాంబ, ఎంపీడీవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

ఏలూరు టౌన్: ఇటీవల స్కూటీ డిక్కీలో ఉన్న నగదు చోరీ జరిగిన కేసును పోలీసులు ఛేదించారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో శనివారం డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లికి చెందిన నందమూరి సత్యనారాయణ తన ఖాతాలో జమ అయిన ధాన్యం డబ్బులు రూ.2.50 లక్షలను భీమడోలు ప్రాంతంలో ఉన్న యూనియన్ బ్యాంక్‌లో ఈనెల 25వ తేదీన విత్‌డ్రా చేసుకుని తన స్కూటీలోని డిక్కీలో పెట్టుకున్నాడు. అనంతరం స్థానికంగా ఉన్న ఓ దుకాణానికి వెళ్లి వస్తువులను కొనుగోలు చేసి తిరిగి వచ్చేసరికి స్కూటీలోని డబ్బు దొంగలించబడింది. బాధితుడు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ యూజే విల్సన్, ఎస్సై సుధాకర్, ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు గుండుగొలను ప్రాంతానికి చెందిన చొప్ప రాముని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి చోరీ సొమ్ము రూ. 2.50 లక్షలను రికవరీ చేశారు.

క్లుప్తంగా

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


విశేష అలంకరణలో శ్రీవరాల వెంకటేశ్వరస్వామివారు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారిని తులసిమాలలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నసమారాధన జరిపారు.

లూథరన్ చర్చిలో ప్రారంభమైన క్రిస్మస్ సందడి


విద్యుత్ కాంతులతో అలరిస్తున్న క్రిస్మస్ పశువుల పాక

పెంటపాడు: డిసెంబర్ నెల ప్రారంభంలోనే పలు చర్చిలలో క్రిస్మస్ సందడి మెదలైంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతి చర్చిలో క్రీస్తు జననవృతాంతాన్ని తెలిపే పశువుల పాక, క్రిస్మస్ ట్రీలు, విద్యుత్ కటౌట్‌లు ఆకర్షణగా నిలుస్తున్నాయి. గూడెం టౌన్ ఎ.క్లాస్ ప్యారిష్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో డిసెంబర్ 1 నుంచె పశువులపాక సెట్టింగ్, క్రిస్మస్ తాత, విద్యుత్ వెలుగులతో క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేసారు. చర్చి గురుమండల అధ్యక్షుడు ఫీనెహాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కటౌట్‌లు, పశువుల పాక సెట్టింగ్‌లు ఆకట్టుకొంటున్నాయి. దీంతో విశ్వాసులలో హడావుడి నెలకొంది.

సాంకేతిక విద్యతో స్వయం ఉపాధి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

పెనుగొండ: సాంకతిక విద్యను అభ్యసించడం వల్ల ఉపాధి అవకాశాలు మెండుగా ఉండడంతో పాటు, స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందని, ఐఎంసీ చైర్మన్, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. శనివారం ఆచంట ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన తొలి ఐఎంసీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సాంకేతిక రంగంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ఐటీఐ వంటి డిప్లొమా కోర్సులు అభ్యసించడం ద్వారా విద్యార్థులు లక్ష్యాన్ని నేరుగా చేరుకోవచ్చునన్నారు. ఐటీఐ ద్వారా ఉన్నత విద్యాభ్యాసం వైపు దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐటీఐకి సొంత స్థలం ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా కలెక్టర్, స్థానిక శాసన సభ్యుడు పితాని సత్యనారాయణలతో కలిసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో ఉపాధి శిక్షణ శాఖ ఆర్‌జేడీ జోన్-2 మధు శ్రీనివాస్ రావు, ఐఎంసీ సభ్యులు గాజుల బులి పుల్లారావు, దొడ్డిపట్ల సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ పరసా వెంకట శ్రీధర్, ట్రైనింగ్ ఆఫీసరు ఇందుకూరి వెంకట సత్యనారాయణ రాజు, పిల్లా ఆనందబాబు, సిరిపురపు భాను ప్రసాద్, సూపరింటెండెంట్ జీఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి


యలమంచిలి: భారత రాజ్యాంగం దేశపౌరులందరికీ సమాన హక్కులను కల్పించిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్‌సన్ కోరారు. మేడపాడు కలెక్టర్ వీధిలోని ఎస్సీ కమ్యూనిటి హాలులో శనివారం నిర్వహించిన జాతీయ మానవహక్కుల సభలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం కుల, మతాలకు అతీతంగా స్త్రీ, పురుషులందరికీ హక్కులు ఉన్నాయన్నారు. ఏ వ్యక్తి హక్కులకు భంగం కలిగిన అధికారుల దృష్టి తీసుకువస్తే న్యాయం చేస్తామన్నారు. ప్రజలకు ఈ విషయాలను వివరించడానికే ప్రతి నెలా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

భీమవరం: డిసెంబర్ 1వ తేదీ హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ నందు జరుగు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బహిరంగ సభను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ పిలుపునిచ్చారు. భీమవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఆయన శనివారం మాట్లాడారు. దళిత సంఘాలు ఏకమై చేస్తున్న ఉద్యమంలో బహిరంగ సభను విజయవంతం చేసి మాలల సత్తా ఏంటో చూపించాలని పిలుపునిచ్చారు.

స్వచ్ఛతలో భేష్

- తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి అవార్డు


ఓపీ వార్డులో స్వచ్ఛత


గూడెం ఏరియా ఆసుపత్రి

తాడేపల్లిగూడెం : స్వచ్ఛత, పరిశుభ్రతలో గూడెం ఏరియా ఆసుపత్రి ఆదర్శమంటూ కేంద్రం ప్రకటించిన కాయకల్ప అవార్డులో రాష్ట్రంలో ఇక్కడి ఆసుపత్రి తొలిస్థానంలో నిలిచింది. పది లక్షల రూపాయల నజరానాకు అర్హత పొందింది. రాష్ట్రంలో ఏరియా ఆసుపత్రులు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు పది అవార్డులు రాగా, వీటిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, ఏలూరు జిల్లా నూజివీడు, భీమవరం పరిధిలో వెంప సీహెచ్‌సీ వంటివి అవార్డులు అందుకుని అగ్రగామిగా ఉన్నాయి. డీసీహెచ్‌గా ఉన్న పగడాల సూర్యనారాయణ పర్యవేక్షణలో సాగిన కేంద్ర బృందం పర్యటనలో అన్ని విషయాలను నిశితంగా పరిశీలించి కాయకల్ప అవార్డులు 2023-24 సంవత్సరానికి ప్రకటించారు. దీంట్లో గూడెం మొదటి స్థానంలో ఉంది.

మరిన్ని సేవలు పెరగాలి

స్వచ్ఛత, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్న గూడెం ఏరియా ఆసుపత్రిలో ప్రస్తుతమున్న సౌకర్యాల మేరకు సేవలు అందుతున్నాయి. గతంలో ఇక్కడ గైనిక్‌ల కొరత తీవ్రంగాఉండేది. ప్రస్తుతం ముగ్గురు వైద్యులు ఈ విభాగంలో ఉండటంతో ఆ కొరత తీరింది. వంద పడకల ఆసుపత్రిగా ఇక్కడకు ట్రామా కేసులు అధికంగా వస్తాయి. జాతీయ రహదారి హైవే బైపాస్ దగ్గరగా ఉండటంతో సత్వర వైద్య సేవలు అందాలంటే ఈ ఆసుపత్రే కావాలి. గోపాలపురం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు వంటి నియోజకవర్గాల ప్రజలకు ఈ ఆసుపత్రి సంజీవనిగా ఉంది. దీర్ఘకాల సమస్యలతో పోరాడే వారికి ఔషధాలను పంపిణీ చేసే ఏఆర్‌టీ సెంటర్ ఉంది. సీమాంక్ సేవలు ఉన్నాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా డయాలసిస్ కేంద్రం ఉంది. ప్రసవాలు నెలలో సరాసరి 150 వరకు జరుగుతాయి. రోజు ఈ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య 400 వరకు ఉంటుంది.

ఆసుపత్రిలో ఉన్న సేవలు

గూడెం ఏరియా ఆసుపత్రిలో నేత్రవైద్య విభాగం, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్ , జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, గైనిక్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

కావాల్సిన సేవలు

రేడియాలజీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ వంటి సేవలు రావాల్సి ఉంది. గైనిక్ సేవలను విస్తృతం చేయాలి. ట్రామాకేర్‌కు ప్రాధాన్యత పెంచాలి. ఆసుపత్రి బెడ్ల సంఖ్యను పెంచాలి.

అవార్డుకు సమన్వయ కృషి



ఏరియా ఆసుపత్రికి కాయకల్ప అవార్డు రావడం సిబ్బంది, వైద్యుల సమన్వయ కృషే. గతంలో బాధ్యతలు నిర్వర్తించిన వారు చేసిన సేవలు. మొత్తంగా అందరి సేవలు సఫలీకృతమై రాష్ట్రంలో స్వచ్ఛత, పరిశుభ్రత విషయంలో రాష్ట్రంలో అగ్రగామిగా ఉండటంతో పాటు, పది లక్షల రూపాయల రివార్డు పొందడం సంతోషం.

– తాతారావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, తాడేపల్లిగూడెం


ఐసీయు ఇలా


బాలింతల వార్డు

3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

పెంటపాడు: మండలంలోని ప్రభుత్వ బేసిక్ ఉన్నత పాఠశాలలో ఈనెల 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించనున్నట్లు ఐఈడీ ఉపాధ్యాయిని స్వరూప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా సమగ్రశిక్షణ సమ్మిళిత విద్యా సమన్వయకర్త సీహెచ్ సుబ్రహ్మణ్యం, సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ శ్యాంసుందరం, మండల విద్యా శాఖాధికారులు ఎం. శ్రీనివాస్, టీవీ రామకృష్ణలు హజరవుతారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోనే అత్యధికంగా పదో తరగతి పాసైన బేసిక్ దివ్యాంగుల విద్యర్థులకు బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందన్నారు.

విద్యార్థులు క్రీడలలో రాణించాలి


ప్రత్తిపాడు సెంట్‌మేరీస్ స్కూల్లో డ్యాన్సులు చేస్తున్న చిన్నారులు

పెంటపాడు: విద్యార్థులు క్రీడలలో ఉన్నతంగా రాణించాలని మండల విద్యాశాఖాధికారి ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. రెండు రోజుల పాటు ప్రత్తిపాడు సెంట్‌మేరీస్ స్కూల్లో నిర్వహించే 37వ క్రీడా పోటీలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాచ్‌ల వారీగా, పేరెంట్‌కు కురీ చ్లాట, తాడు ఆట, కబడ్డీ, పరుగుపందెం, ఖోఖో, ముగ్గుల పోటీలు, ఫ్యాన్సీడ్రెస్ తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు వాసు, సాయిరాం, రవిలతో పాటు, ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఫాదర్ అమల్‌రాజ్ పాల్గొన్నారు. ఉదయం నుండి ఈ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి.

ముమ్మరంగా మినుము మాసూళ్లు


పుల్లాయగూడెం గ్రామంలో మినుము పంటను కోస్తున్న దృశ్యం


అప్పారావుపేటలో చేతికొచ్చిన మినుము పంట

- వాతావరణం అనుకూలించడంతో ఆశాజనకంగా దిగుబడులు
- ఎకరానికి 5-10 బస్తాల దిగుబడులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో మినుము మాసూళ్ల ముమ్మరంగా సాగుతున్నాయి. ఎల్.అగ్రహారం, కొండ్రుప్రోలు, పుల్లాయగూడెం, అప్పారావుపేట, కృష్ణాపురం, మాధవరం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం తదితర గ్రామాల్లో సుమారు రెండువేల ఎకరాల్లో వీబీఎన్-8 రకం మినుము విత్తనాన్ని సాగు చేశారు. బోర్ల ఆయకట్టు ప్రాంతాల్లో ఖరీఫ్ కోతలు పూర్తి కాగానే మినుము పంటను వేశారు. 70 రోజుల పంట కావడంతో ప్రస్తుతం కోతకొచ్చింది. దీనికితోడు ఫెంగల్ తుపాను ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు పంటను కోసే పనిలో నిమగ్నమయ్యారు. పంట తడిస్తే మొలక వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో శనివారం మండల వ్యాప్తంగా మినుము పంట కోత పనులు ముమ్మరంగా సాగాయి. ఎకరానికి ఐదు నుంచి పది బస్తాల దిగుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు.మినుము క్వింటాకు రూ.5వేల నుంచి 6,500లు ఉందని అధికారులు చెబుతున్నారు. వాతా వరణం అనుకూలిస్తే మినుము పంటను కోసి ఒబ్బిడి చేసుకోవాలని ఏడీఏ పి.మురళీకృష్ణ సూచించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


తణుకులో మాదకద్రవ్యాల నిరోధానికి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ ఎస్సై మధుబాబు తదితరులు


విద్యార్థులకు మత్తు పదార్థాల అనర్థాల గురించి వివరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

తణుకు అర్బన్: మత్తు పదార్థాలు సేవించడం ద్వారా మనిషి అనారోగ్యాల బారిన పడడమే కాకుండా తెలియని స్థితిలో చేసే తప్పుల కారణంగా నేరాల్లో ఇరుక్కుంటారని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ ఆర్.మధుబాబు అన్నారు. తణుకులో గంజాయి ఇతర మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సేవించిన వ్యక్తి తాను ఏమి చేస్తున్నాడో తెలియని స్థితికి చేరుకుని నేరాల్లో ఇరుక్కుంటున్నారని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత ఈ మాదక ద్రవ్యాలను ప్యాషన్‌గా మొదలుపెట్టి చివరకు బానిసలుగా మారిపోతున్నారని అన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలు సేవించడం వలన కలిగే నష్టాలు, మానేయదలచిన వారు ఏ చికిత్సలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా డ్రగ్స్, గంజాయి రహిత సమాజ ఏర్పాటు కోసం స్థానికులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఎస్.అప్పలస్వామి, శ్రీమన్నారాయణ, కానిస్టేబుల్ కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

తాడేపల్లిగూడెం: మత్తు పదార్థాలు వినియోగిస్తే ఎన్నో అనర్థాలు ఉన్నాయని, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఎక్సైజ్ అధికారులు విద్యార్థులకు వివరించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు మత్తుపదార్థాల సేవనం, సారా వినియోగం కలిగే అనర్థాల గురించి గూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాన్ని పట్టణంలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేశారు. ఇనస్పెక్టర్ కెఎస్‌వి.కల్యాణచక్రవర్తి తదితరులు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. గంజాయి, హెరాయిన్ వంటి పదార్థాలు జీవితానికి ఎంత చేటుతెస్తాయో తెలిపారు. మత్తు పదార్థాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే తమకు తెలియజేయాలన్నారు. విద్యార్థులతో మత్తు పదార్థాలు వినియోగించం అని ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ ఎస్ఐలు మురళీ మోహన్, దొరబాబు సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర కులగణన నిర్వహించాలి


తణుకులో కృష్ణవేణికి జిల్లా మహిళాధ్యక్షురాలిగా నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: జనగణనలో సమగ్ర కులగణన నిర్వహించి బీసీ వర్గాలకు ప్రాధాన్యతనివ్వాలని బీసీ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ అన్నారు. తణుకు సీతారామాంజనేయస్వామి ఆలయంలో శనివారం రాష్ట్ర బీసీ నాయకులు తమరాపు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన బీసీ చైతన్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేటెడ్ పదవుల్లోను బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌లు కేటాయించాలనే ప్రధాన డిమాండ్‌తో ఇకపై ముందుకు వెళ్తామని అన్నారు. బీసీలంతా ఆర్థికంగా బలపడాలనే ముఖ్య ఉద్దేశ్యమే చైతన్యవేదిక లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా తణుకు పట్టణానికి చెందిన ఆధ్యాత్మిక సేవకురాలు కొలగాని కృష్ణవేణిని బీసీ చైతన్య వేదిక జిల్లా మహిళాధ్యక్షురాలిగా ప్రకటించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ కౌన్సిలర్ తమరాపు రమణమ్మ, బీసీ నాయకులు కట్టా అప్పన్న, యిజ్జాడ ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించాలి


అత్తిలి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలును ప్రారంభించామని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. శనివారం వరకు 4,669 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసామన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు ఇప్పటి వరకు 98,150 అందుబాటులో ఉంచామని చెప్పారు. ధాన్యం విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న రైతులు రైతు సేవా కేంద్రంలో సంచులు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దళారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యం విక్రయించవద్దని, రైతు సేవా కేంద్రం ద్వారా మాత్రమే ధాన్యం విక్రయించి పూర్తి మద్దతు ధర పొందాలని కోరారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే రైతు సేవా కేంద్రం సిబ్బందిని లేదా తహసీల్దార్, మండల వ్యవసాయశాఖ అధికారిని లేదా కాల్ సెంటర్ నెం 1967, 8121676653కు ఫోన్‌చేసి పూర్తి సమాచారం తెలుసుకోవచ్చని ఏఓ రాజేష్ కోరారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

భీమవరం: తుపాను ప్రభావం దృష్ట్యా రైతులు రాబోయే రెండురోజుల్లో వరికోతలు వాయిదా వేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేద్దాం



తణుకులో ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తణుకు టౌన్: ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలని తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ చెప్పారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో శనివారం అవగాహనా ర్యాలీ, మానవ హారం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలలో ఉన్న భయాలను వదలి అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎయిడ్స్ వివారణకు సంబంధించిన అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఐవీ నారాయణ, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ కే జీవన్ బాబు, డాక్టర్ కే నాగభూషణ్ రెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో..

తణుకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తణుకులోని ఎస్ఎన్‌వీటీ జూనియర్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కే ప్రేమకుమారి, న్యాయవాదులు కే మునిస్వామి, ఏ అజయ్‌కుమార్, హెచ్ఐవీ, ఎయిడ్స్ కౌన్సిలర్ ఊబ శ్రీను, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీలో బీఫార్మశీ హెల్ప్‌డెస్క్

తాడేపల్లిగూడెం: ఫార్మశీ కౌన్సిలింగ్ ప్రారంభమైన దృష్ట్యా బైపీసీ విద్యార్థులు రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ల కోసం గూడెం పరిసర ప్రాంత విద్యార్థుల కోసం వాసవీ ఫార్మశీ కళాశాలలో విద్యార్థుల కోరికపై బి.ఫార్మశీ కౌన్సిలింగ్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఏపీసెట్ బైపీసీ స్ట్రీమ్‌లో పరీక్ష రాసి, ర్యాంకు తెచ్చుకున్న వారందరూ కౌన్సిలింగ్ ద్వారా ఫార్మశీలో సీటు పొందవచ్చన్నారు.

పీహెచ్‌సీల్లో అధికారుల పర్యటన

ఉండి: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అత్యున్నతంగా సేవలు అందించాలని ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రత్యేకాధికారులు ఎస్.రవీంద్ర, కె.నాగార్జున అన్నారు. ఉండి పీహెచ్‌సీకి ప్రత్యేకాధికారిగా ఎంపీడీఓ ఎస్.రవీంద్ర, యండగండి పీహెచ్‌సీకి తహసీల్దార్ కె.నాగార్జున నియమితులైన సందర్భంగా శనివారం ఆయా పీహెచ్‌సీలను వారు పరిశీలించి అధికారులు, సిబ్బందితో సమావేశమైయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో సదుపాయాలన్నీ రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సీహెచ్ సాయిచంద్ర, డాక్టర్ డి.బెన్నీ సామ్యూల్, సీహెచ్ఓ ఆర్.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రసాద్ చేసిన సేవలు మరువరానివి


బల్లిపాడులో ఉపాధ్యాయుడు ప్రసాద్‌ను సత్కరిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, తదితరులు

అత్తిలి: ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులకు విద్యాబోధనతో పాటు పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు ఉపాధ్యాయుడు డీఎంజీ ప్రసాద్ విశేష కృషి చేసారని ఎస్టీయూ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఎల్ సాయిశ్రీనివాస్ అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేసి పదవీవిరమణ చేసిన ప్రసాద్‌కు శనివారం పాఠశాల తరపున వీడ్కోలు సత్కార కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రసాద్ తన సొంత నిధులతో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, ఫీజులు, దుస్తులు అందజేసారన్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకునిగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేసారని శ్లాఘించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా డీఎంజీ ప్రసాద్ దంపతులను పాఠశాల తరపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె రామచంద్రవవు, జిల్లా జనరల్ సెక్రటరీ పీఆర్‌వీఎస్ సాయివర్మ, జిల్లా అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షుడు భూపతిరాజు జవహర్‌లాల్‌రాజు, ఎస్ఎంసీ చైర్మన్ ప్రగడ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎస్ పురుషోత్తం, జి శ్రీనివాస్ పాల్గొన్నారు.